క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

అచ్యుతాపురం: వైఎస్సార్‌సీపీ యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాలకు నియామకాలు చేపడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ యూత్ విభాగం అధ్యక్షుడిగా సిదయారి నాగ నూకరాజు, ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా బొద్దపు సత్య నారాయణ నియమితులయ్యారు.

ఆలయాలకు అక్షయ తృతీయ శోభ



వాడ్రాపల్లిలో చలివేంద్రం ప్రారంభిస్తున్న సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు

మునగపాక: మండల వ్యాప్తంగా బుధవారం అక్షయ తృతీయ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాడ్రాపల్లిలోని సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో పెతకంశెట్టి రామజోగినాయుడు–నాగలక్ష్మి దంపతుల సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మళ్ల కన్నుంనాయుడు, మళ్ల శేషు, కొణతాల అప్పారావు, యల్లపు చిన్నారి, తదితరులు పాల్గొన్నారు.

జబర్దస్త్ సత్తిపండుకు సత్కారం



సత్తిపండును సత్కరిస్తున్న సిరసపల్లి ఎంపీటీసీ వీరునాయుడు

మునగపాక: జబర్దస్త్ నటుడు సత్తిపండును బుధవారం ఘనంగా సత్కరించారు. మండలంలోని టి.సిరసపల్లిలో జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరైన ఆయన స్థానికంగా ఉన్న సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టి.సిరసపల్లి ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, తదితరులు సత్తిపండును శాలువా కప్పి సన్మానం చేశారు.

ఉపాధి హామీ పనుల ప్రారంభం



టి.సిరసపల్లిలో ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

మునగపాక: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి కోరారు. బుధవారం సిరసపల్లి పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలు, చెరువుల అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, పరశురామ్, పాలమరశెట్టి నవీన్, వీర గణేష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి

మునగపాక: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి అన్నారు. మండలంలోని చూచుకొండలో బుధవారం కిశోర్ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయన్నారు. కిషోర్ బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ప్రహరీ పనులు ప్రారంభం



శ్మశానవాటికలో పనులు ప్రారంభిస్తున్న బొలిశెట్టి గోవిందు తదితరులు

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారంలో శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణానికి మండల పరిషత్ నిధులు కేటాయించినట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు తెలిపారు. రోడ్డు పక్కన ఉన్న శ్మశానవాటికకు ప్రహరీ లేకపోవడంతో అసౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ఈ మేరకు రూ.5లక్షల నిధులు కేటాయించి, పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కర్రి శ్రీను, ఉద్దండం సూర్యనారాయణ, సియ్యాదుల అచ్చుత్‌కుమార్ పాల్గొన్నారు.



తుని వైపున తాండవ నదిలో పేరుకుపోయిన చెత్త



పాయకరావుపేటలో ముఠా ఆనకట్ట వద్ద డంప్ చేసిన చెత్త

తాండవ నదా.. డంపింగ్ యార్డా.!

తాండవ నదిలో యథేచ్ఛగా చెత్త డంపింగ్

ప్రశ్నార్థకంగా మారిన సాగునీరు

పాయకరావుపేట: రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి అవసరాలకు ఉపయోగపడే తాండవ నది డంపింగ్ యార్డును తలపిస్తోంది. చెత్తను యథేచ్ఛగా నదిలో డంపింగ్ చేస్తున్నా అడిగే నాథుడే కరువయ్యారు. దీంతో మండలంలోని వేలాది ఎకరాలకు సాగునీరు సరఫరా ప్రశ్నార్థకంగా మారింది. తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన చెత్తను తాండవ నదిలో డంప్ చేస్తున్నారు. పాయకరావుపేట పంచాయతీకి సంబంధించిన చెత్తను పట్టణ సమీపాన ఉన్న ముఠా ఆనకట్ట వద్ద నదిలో పడేస్తున్నారు. అదే విధంగా అటు వైపున నది ఒడ్డున తుని మున్సిపాలిటీకి చెందిన చెత్తను తుని పట్టణం పొడవునా గల తాండవ నదిలోనే పడేస్తున్నారు. దీంతో అటు వైపు తుని, ఇటు వైపు పాయకరావుపేట పక్కన ఉన్న తాండవ నది గర్భం కుచించుకుపోతోంది. తాండవ నది ద్వారా రైతులకు ముఠా ఆనకట్ట, భూమి ఆనకట్ట ద్వారా మండలంలోని 24 గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలకు సాగునీరు సరఫరా జరుగుతుంది. ఈ చెత్త విషయంపై గతంలో అధికారులకు పలు సందర్భాల్లో ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోలేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

తప్పని ముంపు సమస్య

భారీ వర్షాలు పడిన సమయంలో తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తుంటుంది. అటువంటప్పుడు నీటి ప్రవాహానికి నదికి ఇరువైపులా వేస్తున్న చెత్త ఆటంకంగా మారుతోంది. ఫలితంగా పాయకరావుపేట పట్టణానికి ముంపు ముప్పు ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తుని, పాయకరావుపేటలకు చెందిన చెత్తను నిత్యం డంప్ చేస్తున్నప్పటికీ నీటి పారుదల శాఖ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి నదిలో వేస్తున్న చెత్తను నివారించి, వేసిన చెత్తను కూడా తొలగించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

చెత్తతో నదిని కప్పేస్తున్నారు..



తాండవ నదిలో చెత్తను వేసి నది గర్భం కప్పేస్తున్నారు. రైతుల పంట పొలాలకు సాగునీటి సరఫరా ఇబ్బందవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి నదిలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి.

– పెనుమత్స నాగేశ్వరరావు, రైతు, మంగవరం

అంచనా బడ్జెట్ కేటాయింపులకు ఆమోదం

- లోపాలు, అధిక కేటాయింపులపై నిలదీసిన వైస్ చైర్మన్ గుప్తా
- నరికిన చెట్ల కొమ్మలు తొలగించక పోవడంపై విద్యుత్ శాఖకు నోటీసు ఇవ్వాలని ఆదేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ 51వ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి అధ్యక్షతన బుధవారం సాయంత్రం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో జరిగింది. 2025–26 వార్షిక అంచనా బడ్జెట్ కేటాయింపులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. కేటాయింపుల్లో కొన్ని అధికంగా చూపడం, కొన్ని రిపీట్ కావడంపై వైస్ చైర్మన్ అర్రెపు సత్య గుప్తా నిలదీశారు. బడ్జెట్ కేటాయింపుల వివరాలు తప్పులతడకగా ఉన్నాయన్నారు. అంతకు ముందు అజెండాలో పొందుపరిచిన 5 అంశాలను సమావేశంలో చదివి వినిపించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్లలో రాష్ట్రంలో 10వ స్థానంలో యలమంచిలి మున్సిపాలిటీ నిలిచిందని, వచ్చే ఏడాదిలో 5వ స్థానానికి చేరుకునేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన 5 శాతం రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగపర్చుకున్నారన్నారు. సుమారు కోటి రూపాయల వరకు ఆస్తి పన్నులు వసూలు జరిగాయన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించడంపై సమావేశంలో ఆగ్రహం వ్యక్తమైంది. నిర్వహణ పనుల్లో భాగంగా చెట్ల కొమ్మలు నరికిన తర్వాత వాటిని రోడ్డు పక్కనే వదిలేస్తున్నారని, దీని వల్ల ప్రజలు ఇబ్బందులు పడడంతో పాటు అవన్నీ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కాలువల్లోకి చేరి పూడుకుపోతున్నాయన్నారు. విద్యుత్ శాఖ అధికారులకు నోటీసు ఇవ్వాలని, నరికించిన చెట్ల కొమ్మలు వారు తొలగిస్తారా?లేక మున్సిపాలిటీ తొలగించాలంటే దానికయ్యే ఖర్చు ఆ శాఖ భరిస్తుందా? అన్నది స్పష్టత తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని, పట్టణంలో ఇప్పటికే రెండు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, మరో రెండు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాబోయే వర్షాకాలంలో ముంపు తలెత్తకుండా చూడాలని అధికారులకు చెప్పారు. తిరుపతి వంటి పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ చక్కగా ఉంటోందని, యలమంచిలిలో ఆ తరహా నిర్వహణ ఉండేలా చూసేందుకు కమిషనర్‌తో కూడిన అధికారుల బృందం ఆయా పట్టణాలకు వెళ్లి పారిశుధ్య నిర్వహణపై అధ్యయనం చేయాలని నిర్ణయించారు. కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, వార్డు కౌన్సిలర్లు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో 2025–26 సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఎస్ఎస్‌సీ, టీసీ, కుల, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఈమెయిల్ ఐడీ, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్‌తో ఐటీఐలో కళాశాలలో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టల్‌లో నమోదు చేసి ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈనెల 26లోపు తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ఘనంగా శ్రీశ్రీ జయంతి వేడుకలు



కళాకారుడు నాయుడును సత్కరిస్తున్న మునగపాక గ్రామీణ యువజన మందిరం సభ్యులు

మునగపాక: మునగపాక గ్రామీణ యువజన మందిరం ఆధ్వర్యంలో బుధవారం తెలుగు కవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటం వద్ద పలువురు కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువజన మందిరం గౌరవాధ్యక్షుడు సూరిశెట్టి రాము మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలు నేటికీ చెక్కు చెదరలేవన్నారు. అనంతరం కందుకూరి విరేశలింగం అవార్డు అందుకున్న పీసీహెచ్.నాయుడు, శాస్త్రవేత్త శివాజీలను ఘనంగా సత్కరించారు. యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి ఆడారి సూర్యచంద్రరావు, కాంట్రేగుల జగ్గారావు, టిక్కలి పరశురామ్, పెంటకోట వెంకట్, ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో వ్యక్తిత్వ వికాసం



కోటవురట్ల గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన కల్పిస్తున్న టీచర్ నరసింగరావు



పాయకరావుపేట గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు

కోటవురట్ల: గ్రంథాలయాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని ఉపాధ్యాయుడు జె.నరసింగరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి స్టోరీ టెల్లింగ్, స్పోకెన్ ఇంగ్లిషుపై అవగాహన కల్పించారు. నరసింగరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. మంచి నడవడిక, వ్యక్తిత్వం, స్నేహాలు ఇక్కడే సాధ్యమన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన

పాయకరావుపేట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్, భగవద్గీత శ్లోకాలు నేర్పించడం, యోగా, ఆటలు ఆడించినట్లు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు తెలిపారు. రిసోర్స్ పర్సన్‌గా ఎస్.సీతారామయ్య, వై.అచ్యుతరావు, రాజు వ్యవహరించారు. 47 మంది విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌కు హాజరైనట్లు లక్ష్మణరావు తెలిపారు.

ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎం ధర్మారావుకు సత్కారం



ధర్మారావు దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎస్.రాయవరం: ఉద్యోగ విరమణ పొందిన ధర్మారావు శేషజీవితం సుఖమయంగా సాగాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అన్నారు. గుర్రాజుపేట యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన కె.కె.ఎల్.ఎన్.ధర్మారావు బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా అడ్డురోడ్డులో ఏర్పాటు చేసిన అభినందన సభలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా ధర్మారావు పని చేయడంతో జిల్లా నలుమూల నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కర్రి సత్యానారాయణ, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మంజుల, మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ కార్యదర్శి దుర్గాప్రసాద్, పూర్వపు కార్యదర్శి బి.వెంకటపతిరాజు, యలమంచిలి డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళ నగదు అందజేస్తున్న పెదఉప్పలం గ్రామస్తులు

ఎస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో శరవేగంగా నిర్మాణం జరుగుతున్న అయ్యప్ప స్వామి ఆలయానికి పెదఉప్పలం గ్రామస్తులు రూ.20,472 నగదును ఉత్సవ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. కోటి రూపాయలకు పైగా అంచనాతో ప్రారంభించిన ఈ ఆలయానికి పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున విరాళాలు వస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదఉప్పలం నాయకులు శిగటాపు జోగిరాజు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ మెంబర్ కొణతాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన అవసరం



అవగహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు

ఎస్.రాయవరం: కిశోర బాలికలకు సంపూర్ణ పోషకాహారం అందేలా అవగాహన కల్పించాలని నక్కపల్లి ఐసీడీఎస్ పీవో శ్రీవిద్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీసులకు కిశోర వికాసంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో మే నెల మొత్తం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. బాలికలకు పోషకాహారం అందివ్వడంతో పాటు, బాల్య వివాహాలు జరగకుండా కూడా అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సత్యనారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎంబి నిషా, తులసి, తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



రమణయ్యపేటలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన వరద నీరు



పోలవరం కాలువ గట్లు వేయడంతో గ్రామంలో నీరు బయటకు వెళ్లే అవకాశం లేక నిలిచిపోయిన దృశ్యం



దొంకాడ ఎస్‌సీ కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిపోయిన వర్షపు నీరు



నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో నిలిచిపోయిన వర్షపు నీరు



మునగపాక సంతబయిల రహదారిపై నిలిచిన వర్షం నీరు

నక్కపల్లి: మండలంలో బుధవారం కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. సాయంత్రం భారీ వర్షం పడింది. దీంతో రమణయ్యపేట, దేవవరం, ఉద్దండపురం, నెల్లిపూడి, వేంపాడు, గుల్లిపాడు, జగన్నాథపురం, దొంకాడ గ్రామాల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి, వీధుల్లోకి చేరింది. ఎడతెరపి లేకుండా సుమారు గంటన్నర పాటు వర్షం కురవడంతో వీధులు, రోడ్లు, కాలువలు జలమయమయ్యాయి. రమణయ్యపేటలో పోలవరం కాలువ గట్టుపై మట్టి వేయడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వర్షపు నీరు బయటకు పోయే మార్గాలు లేక ఎక్కడికక్కడ నిలిచిపోయింది. పశువుల పాకల్లోను, తాటాకు ఇళ్లల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో చాలా మంది ఇబ్బంది పడ్డారు. పశువులు వరద నీటిలోనే ఉండిపోవడంతో నీటిని బయటకు పంపించేందుకు పాడి రైతులు ఇబ్బంది పడ్డారు. దొంకాడ దళిత కాలనీలో వర్షపునీరు వీధిరోడ్లు, కాలువల్లోను, ఇళ్లల్లోకి చేరింది. ఇక్కడ కూడా డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. ఇళ్లల్లోకి చేరిన నీటిని గిన్నెలు, బిందెలతో బయటకు తోడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జగన్నాథపురం, ముకుందరాజుపేట వేంపాడు ఎస్‌సీ కాలనీ, నెల్లిపూడి తదితర గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. దేవవరంలో వీధులన్నీ జలమయయ్యాయి. మండల కేంద్రం నక్కపల్లిలో ఉన్న ఏరియా ఆస్పత్రి ప్రాంగణమంతా వర్షపు నీటితో చెరువును తలపించింది. ఉపమాక ఆలయం ఎదురుగా రాజయ్యపేట రోడ్డు, చందనాడు వెళ్లే రోడ్లన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. ఉద్దండపురంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నివాస ప్రాంతాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఇళ్లల్లో నుంచి బయట అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది.

మునగపాకలో భారీ వర్షం

మునగపాక: మండల వ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి, బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో సతమతమైన ప్రజలు ఈ వర్షాలతో సేదతీరారు. 44.64 మిల్లీమీటర్ల మేర వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. పలు చోట్ల వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు పోయే మార్గం లేక అవస్థలు పడ్డారు. కాగా ఈ వర్షం వ్యవసాయ పంటల సాగుకు మేలు చేకూరుస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీకి జరిమానా

మునగపాక: అధిక లోడుతో వెళ్తున్న లారీకి రూ.70వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. పరిమితికి మించి లోడుతో వాహనాలు వెళ్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు బుధవారం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో అధిక లోడుతో వెళ్తున్న లారీని గుర్తించి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి

కశింకోట: కశింకోటలో మాజీ సైనికులు కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన అమాయక పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేసి నివాళులర్పించారు. స్థానిక పొట్టి శ్రీరాములు పార్కు నుంచి ప్రారంభమైన ప్రదర్శన ప్రధాన రహదారి మీదుగా జాతీయ రహదారి వరకు సాగింది. ఎక్కువ మంది మాజీ సైనికులు పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారంపై వీఆర్‌ఏల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

తుమ్మపాల: గ్రామాన్ని అంటిపెట్టుకుని అనేక రకాల రెవెన్యూ సేవలు అందిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల(వీఆర్‌ఏ)కు జీతాలు పెంచి పే–స్కేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద బుధవారం వీఆర్‌ఏలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు బ్రిటిష్ కాలం నుంచి గ్రామాల్లో పనిచేస్తున్నారని, గ్రామంలో ప్రభుత్వ భూములు పరిరక్షణతో పాటు భూముల వివరాలపై అవగాహనతో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తున్నారన్నారు. గ్రామ సేవకులకు గౌరవ వేతనం పేరుతో అతి తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని, నెలకి ఇచ్చే రూ.10,500 జీతంతో గ్రామ సేవకుల జీవనం దుర్భరంగా ఉందన్నారు. రెవెన్యూ సర్వేలు, రీసర్వేలు పేరుతో కార్యాలయాలకు, గ్రామాలకు తిరిగే చార్జీలకే జీతం ఖర్చు అయిపోతుందన్నారు. గతంలో ఇచ్చే డీఏ కూడా ఉపసంహరించారన్నారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పదోన్నతి కల్పించకపోవడం దారుణమన్నారు. తెలంగాణ రాష్ట్రం వలే వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు రాత్రిపూట తహసీల్దార్ కార్యాలయాల వద్ద నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, ఇటీవల డ్యూటీలో ఉండగా కశింకోటలో వీఆర్‌ఏ గుండెపోటుకు గురయ్యారన్నారు. ఎటువంటి ఉత్తర్వులు లేకుండా నైట్ డ్యూటీలు వేయడం అన్యాయమన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, ఎస్.గంగాధర్, జిల్లా కోశాధికారి సంతోష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతికుమారి, తోటాడ సింహాచలం, పరదేశినాయుడు, వి.రమణ, నరేంద్ర పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టికి అడుగులు



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

కశింకోట: చెత్త నుంచి సంపద సృష్టించడానికి అడుగులు పడుతున్నాయని జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి అన్నారు. కశింకోటలోని సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. దాని పని తీరును పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీలు మరింత ఆదాయాన్ని సమకూర్చుకునేలా కార్యాచరణ రూపొందించిదన్నారు. కశింకోట సంపద కేంద్రం జిల్లాలోనే ఆదర్శంగా ఉంటుందన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. తడి చెత్తను సంపద కేంద్రానికి తరలించి సేంద్రియ ఎరువు తయారు చేస్తారన్నారు. దాన్ని విక్రయించడం ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరనుందన్నారు. ఈవోపీఆర్డీ ఎం.వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామచంద్రరావు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.